క్లుప్తంగా

జోరుగా ఓటర్ల జాబితాల పరిశీలన



తాళ్లరేవు తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్న సిబ్బంది

తాళ్లరేవు: ఓటర్ల జాబితాల పరిశీలన జోరుగా సాగుతోంది. బీఎల్ఓలు సెలవు రోజైన ఆదివారం కూడా జాబితాల పరిశీలనలో పాల్గొన్నారు. తహసీల్దార్ ఎస్.పోతురాజు ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఆదేవిధంగా ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలను కూలంకషంగా పరిశీలిస్తున్నారు.

రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రేణుకా ఎల్లమ్మ అమ్మవారు

ఉప్పలగుప్తం: సంకటహర చతుర్థి సందర్భంగా మండలంలోని పెదగాడవిల్లి గ్రామంలో వేంచేసియున్న రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పవన్‌కుమార్‌కు సత్కారం



పవన్‌కుమార్‌ను సత్కరిస్తున్న, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ముఖ్య సలహాదారు నల్లా పవన్ కుమార్‌ను చాంబర్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ ట్రేడర్ల వ్యాపారులు ఆదివారం ఘనంగా సత్కరించి అభినందించారు. పవన్‌కుమార్‌కు ఇటీవల జాతీయ అవార్డు వచ్చిన నేపథ్యంలో సత్కరించారు. కార్యక్రమంలో చాంబర్ ఫౌండర్ గోకరకొండ హరిబాబు, కంచిపల్లి అబ్బులు, దొమ్మేటి సాయిబాబు, కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, చింతలపూడి సత్తిబాబు, రేకపల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న ప్రైవేటు బస్సు

ప్రయాణికులకు స్వల్ప గాయాలు



జాతీయ రహదారిలో కోరంగి వద్ద చెట్టును ఢీకొన్న ప్రైవేటు బస్సు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో ఆదివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో ఒక ప్రైవేటు బస్సు చెట్టును ఢీకొన్న ఘటనలో ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పి.గన్నవరం నుంచి అన్నవరం పెళ్లికి వెళ్లిన బృందం తిరిగి వస్తుండగా కోరంగి పోలీస్‌స్టేషన్ సమీపంలో బస్సు బ్రేక్ ఫెయిల్ కావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు. బస్సు చెట్టును ఢీకొని ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. కోరంగి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపికైన సాయిజానకి



సాయిజానకి

యానాం: పుదుచ్చేరి విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏటా ఎంపిక చేసే బెస్ట్ టీచర్ అవార్డుకు యానాం అంబేడ్కర్ నగర్ డీఎస్ఆర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విక్రాంత ప్రధానోపాధ్యాయురాలు బులుసు సాయిజానకి ఎంపికయ్యారు. వీటికి సంబంధించిన ఎంపిక జాబితాను స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రియదర్శిని ఆదివారం విడుదల చేశారు. సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం రోజున పుదుచ్చేరిలో నిర్వహించే వేడుకల్లో ఆమె సీఎం రంగసామి, ఎల్జీ తమిళిసై సౌందరాజన్, స్పీకర్ సెల్వం చేతుల మీదుగా బెస్ట్ టీచర్ అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా సాయిజానకిని పలువురు విద్యాశాఖ అధికారులు, నియోజకవర్గ పరిధిలోని టీచర్లు అభినందించారు.

వాడవాడలా దోమలపై దండయాత్ర

- రూ.9 లక్షలతో వెహికల్ మౌంటెడ్ ఫాగింగ్ మెషీన్ల కొనుగోలుకు ప్రతిపాదన
- ప్రస్తుతానికి నాలుగు ఫాగింగ్ మెషీన్లతో దోమల నిర్మూలన



పట్టణంలో దోమల నిర్మూలనకు ఫాగింగ్ మెషీన్ ద్వారా వదులుతున్న పొగ

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలోని 30 వార్డు ప్రజలను ఇబ్బంది పెడుతున్న దోమలపై పూర్తి స్థాయిలో దండయాత్ర చేసేందుకు పారిశుధ్య విభాగం ఓ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. గత ఆరు నెలలుగా జరిగిన కౌన్సిల్ సమావేశాల్లో కౌన్సిలర్లంతా మరమ్మతులతో ఉన్న ఫాగింగ్ మెషీన్లను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూనే ఉన్నారు. దీంతో మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలన్న మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడుల ఆదేశాలతో నాలుగు ఫాగింగ్ మెషీన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం పట్టణంలో వాటి ద్వారా రోజూ రాత్రి సమయాల్లో పొగ వదిలే ప్రక్రియ కొనసాగిస్తున్నారు. అయితే ఫాగింగ్ మెషీన్లను ఉంచి ఆపరేషన్ చేసే ట్రాక్టర్లు చిన్న వీధులు, సందుల్లోకి వెళ్లలేకపోతున్నాయి. అలాంటి ప్రతికూల పరిస్థితులున్న ప్రాంతాల్లోనూ దోమలను తరిమికొట్టేందుకు కొత్త ప్రణాళిక రచించారు.

రూ.9 లక్షలతో అధునాతన వాహనం

ప్రస్తుతం చెత్తను తరలించే ట్రాక్టర్ ట్రక్కుపై ఫాగింగ్ మెషీన్లను ఉంచి అవి వెళ్లగలిగే రహదారుల్లో రోజూ పొగ వదులుతున్నారు. చిన్న సందుల్లో 16 కిలోల బరువుండే ఫాగింగ్ మెషీన్లను సిబ్బందే మోసుకెళ్లి ఫాగింగ్ చేయాల్సి వస్తుంది. ఇలాంటి ఇబ్బందులను అధిగమించేందుకు రూ.9 లక్షలతో అధునాతన సౌకర్యాలతో ఉండే వెహికల్ మౌంటెడ్ ఫాగింగ్ మెషీన్‌ను కొనుగోలు చేసేందుకు మున్సిపాలిటీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ మెషీన్ అందుబాటులోకి వస్తే చిన్న వీధుల్లోకి, సందుల్లోకి వెళ్లి సులువుగా ఫాగింగ్ చేసే వీలుంటుంది. దీంతో పాటు వర్షాలు పెరిగితే డ్రెయిన్లలో దోమలను ఆదిలోనే నశింపజేసేందుకు ఎంఎల్ ఆయిల్ బాల్స్ వేయడం, దోమలను లార్వా దశలోనే అంతం చేసేందుకు కెమికల్ ద్రావణంతో కూడిన స్ప్రేలు చేసేందుకు పారిశుధ్య విభాగం సమయాత్తమవుతోంది. మున్సిపాలిటీకి తోడు ఫైలేరియా డిపార్ట్‌మెంట్ సిబ్బంది చేపట్టే ఆపరేషన్‌ను కూడా ఇక నుంచి మరింత విస్తృతం చేసేందుకు చర్యలు చేపట్టనుంది.

> **ఇక నిరంతరాయంగా చర్యలు**
>
> నాలుగు ఫాగింగ్ మెషీన్లను అందుబాటులోకి తెచ్చాం. ఇక వాటి ద్వారా నిరంతరాయంగా దోమల నిర్మూలనకు చర్యలు చేపడతాం. చిన్న చిన్న వీధుల్లో సైతం ఫాగింగ్ చేసేందుకు వీలుగా ఉండే వెహికల్ మౌంటెడ్ ఫాగింగ్ మెషీన్ కొనుగోలుకు ప్రతిపాదనలు చేశాం. అది అందుబాటులోకి వస్తే సమయం ఆదా కావడంతో పాటు ఇద్దరు చేయాల్సిన పని ఒక్కరితోనే చేయడానికి ఆస్కారమేర్పడుతుంది.
>
> – కె.వెంకటేష్, పారిశుధ్య పర్యవేక్షణాధికారి, ఏఈ, అమలాపురం మున్సిపాలిటీ

దంతాల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



క్లబ్ కార్యదర్శి కృష్ణకామేశ్వర్‌కు బహుమతి అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

అమలాపురం రూరల్: ఆహారాన్ని జీర్ణం చేయడంలో కీలక పాత్ర పోషించే దంతాల ఆరోగ్యం విషయంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని దంత వైద్య నిపుణుడు ప్రసాద్ అన్నారు. వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఆదివారం జరిగిన ఆరోగ్య సదస్సులో డాక్టర్ ప్రసాద్ «దంతాల ఆరోగ్యం–రక్షణ మార్గం» అనే అంశంపై ఉపన్యసించారు. సాధారణ దంత సమస్యల గురించి డాక్టర్ ప్రసాద్ వాకర్స్‌కు అవగాహన కల్పించారు. అనంతరం క్లబ్ కార్యదర్శి పుత్సా కామేశ్వర్‌కు బహుమతి అందజేశారు. సదస్సులో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, వాకర్స్ ఏరియా కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, వాకర్స్ జిల్లా డిప్యూటీ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్, పి.రాజా, దువ్వూరి సుబ్బలక్ష్మి, వలవల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన



గోడిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లో సుపరిపాలన అందుతుందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. మండలంలోని గోడి పంచాయతీ పరిధిలో ఉన్న ఇందిరానగర్, అంబేడ్కర్ నగర్, రాజుల వీధి, గోడిపాలెం ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆదివారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ తోట శ్రీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామానికి రూ.20 లక్షల నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ ప్రభంజనం సృష్టిస్తుందన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా దీవించాలని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాండ్రేగుల వాణీఅచ్యుతం, ఉప సర్పంచ్ డి.సత్తిబాబురాజు, గ్రామకమిటీ అధ్యక్షుడు దొమ్మేటి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు రేవు శ్రీనివాసరావు, జల్లి ఏడుకొండలు, కడలి సత్యప్రసాద్, కొప్పిశెట్టి సత్యనారాయణ, ఉప్పే శ్రీనివాసరావు, మాకే రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువుకు ఆర్థిక భరోసా



విద్యార్థిని జానకికి చెక్కును అందజేస్తున్న రమణారావు

ఉప్పలగుప్తం: ఆర్థిక స్తోమత లేని విద్యార్థినికి చల్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే రమణారావు ఉన్నత చదువులు చదువుకోవడానికి రూ.40 వేల చెక్కును ఆదివారం అందజేశారు. మండలంలోని చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధి ఊరపేటకు చెందిన విద్యార్థిని గంటి జానకి గోడి గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. అనంతరం ఆమె బీఎస్సీ ఫిషరీస్ చదవాలని నిర్ణయించుకుంది. అయితే నాలుగేళ్లకు గాను రూ.1.60 లక్షలు ఖర్చవుతుందని తెలియడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో పడింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రమణారావు విద్యార్థిని ఉన్నత చదువుకు సహకరిస్తానని భరోసా ఇవ్వడంతో పాటు రూ.40 వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో జి.లక్ష్మీప్రసాద్, కాట్రు మధు, రొక్కాల బాబీ, హేమంత్, బుజ్జి, పరమట రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సాత్విక్ సాయిరాజ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



విజేతలతో ఆర్డీవో వసంతరాయుడు, వాకర్స్, ఆఫీసర్స్ క్లబ్‌ల ప్రతినిధులు

అమలాపురం టౌన్: మండల షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు అమలాపురం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆర్డీవో వసంతరాయుడు అన్నారు. అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్, ఆఫీసర్స్ రీక్రియేషన్ క్లబ్ సంయుక్త ఆధర్యంలో స్థానిక ఆఫీసర్స్ క్లబ్ ఇండోర్ కోర్టులో జరుగుతున్న మండల స్థాయి జూనియర్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో వసంతరాయుడు విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌ను ఆర్డీవో అభినందించారు. అండర్–11, అండర్–13, అండర్–15 మూడు విభాగాల్లో క్రీడాకారులకు పోటీలు నిర్వహించినట్లు వాకర్స్ క్లబ్ కార్యదర్శి, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ ఉపాధ్యక్షుడు డాక్టర్ మెట్ల వెంకట సూర్యనారాయణ, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న విద్యార్థినికి అభినందన



తమిళనాడు గవర్నర్ రవి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న అనుపమ

యానాం: తమిళనాడు గవర్నర్ ఆర్ఎస్ రవి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్న విద్యార్థిని ముదాం అనుపమను ఆదివారం రీజెన్సీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జీఎస్‌నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీజెన్సీ విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్‌ను అభ్యసించిన అనుపమ తమిళనాడు మదర్‌థెరిస్సా యూనివర్సిటీలో డైటీషియన్ అండ్ న్యూట్రీషియన్ కోర్సును పూర్తి చేసి యూనివర్సిటీ స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించి తమిళనాడు గవర్నర్ రవి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు పార్వతి, రామచంద్రయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా కౌశిక్



ఆర్డీఓ వసంతరాయుడు నుంచి మెమెంటో అందుకుంటున్న కౌశిక్ సాయి పవన్ (ఎడమవైపు ఉన్న క్రీడాకారుడు)

అల్లవరం: వాకర్స్ హెల్త్ క్లబ్, ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో అమలాపురం దుడ్డువారి అగ్రహారంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్, డబుల్ విభాగాల్లో పప్పుల కౌశిక్ సాయి పవన్ విన్నర్‌గా నిలిచాడు. బోడసకుర్రు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కౌశిక్ సాయిపవన్ అండర్–15 విభాగంలో సరహరశెట్టి వెంకటరావు, అమ్మన్న మెమోరియల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజయం సాధించాడని పీడీ అప్పారి త్రిమూర్తులు ఆదివారం తెలిపారు. విజేతగా నిలిచిన కౌశిక్‌ను ఆర్డీఓ వసంతరాయుడు అభినందించి మెమెంటోని అందజేశారు.

టెట్ పాసైతేనే టీచర్ పోస్టులకు అర్హత

యానాం: ఇకపై టీచింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) తప్పనిసరిగా పాసై ఉండాలని పుదుచ్చేరి ప్రభుత్వం ఆదివారం మార్గదర్శకాలు జారీ చేసింది. అంతేకాదు ఇక నుంచి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నిర్వహించే టెట్ అర్హతలున్న పుదుచ్చేరివాసులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. టెట్‌లో జనరల్ అభ్యర్థులకు 90 మార్కులు, ఎంబీసీ, ఓబీసీ, ముస్లిం కేటగిరీ వారికి 82 మార్కులు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 75 మార్కులు వచ్చినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ప్రాథమిక పాఠశాలల టీచర్లకు డీఈడీలో 70 శాతం మార్కులు, 20 శాతం టెట్ వెయిటేజీ, 10 శాతం ఎంప్లాయ్‌మెంట్ సీనియారిటీని ఉద్యోగ వెయిటేజీకి పరిగణనలోకి తీసుకుంటారన్నారు. గ్రాడ్యుయేట్ టీచర్‌కు బీఈడీ కోర్సులో 70 శాతం మార్కులు, 20 శాతం టెట్ వెయిటేజీ, 10 శాతం ఎంప్లాయ్‌మెంట్ సీనియారిటీని ప్రాతిపదికగా తీసుకుంటారన్నారు.

నిరుపయోగంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

అంబాజీపేట: లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో అంబాజీపేట హడ్కో కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు ఏడాది నుంచి నిరుపయోగంగా ఉన్నాయి. హడ్కో కాలనీ, నెల్లివారిపేట వాసులు నిత్యం లోవోల్టేజీ సమస్యతో బాధపడుతున్నామని, సమస్యను పరిష్కరించేందుకు ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ వైర్లు వేయాలని విద్యుత్ శాఖ అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నామన్నారు. దాంతో ఏడాది క్రితం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తామని అప్పటి విద్యుత్ శాఖ అధికారులు చెప్పారు. అనంతరం కాలనీకి వచ్చిన విద్యుత్ వైర్లను వేరే ప్రాంతానికి తరలించి వినియోగించుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అప్పటి నుంచి నేటి వరకు ట్రాన్స్‌ఫార్మర్‌ను నిరుపయోగంగా ఉంచడమే కాకుండా కాలనీలోని లోవోల్టేజీ సమస్యను పరిష్కరించలేదని స్థానికులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలను వినియోగంలోకి తీసువచ్చి మా కాలనీలకు లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

12, 13 తేదీల్లో స్కూల్ గేమ్స్ నిర్వహణ



ఎంఈవో కిషోర్‌కుమార్

సఖినేటిపల్లి: మండలంలో కేశవదాసుపాలెం, మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 12, 13 తేదీల్లో 67వ స్కూల్ గేమ్స్ క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో–1 డి.కిషోర్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈమేరకు వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, వ్యాయామోపాధ్యాయులతో ఒక సమావేశం ఆయన నిర్వహించారు. ఆయా పాఠశాలలో నిర్వహించే గేమ్స్ వివరాలు, వేదికలను నిర్ణయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 12వ తేదీన కేశవదాసుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్–14, అండర్–17 బాలుర విభాగంలో పోటీలు ఏర్పాటు చేశామన్నారు. వీరికి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, బ్యాట్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో పోటీలు ఉంటాయన్నారు. అలాగే ఈ నెల 13వ తేదీన మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్–14, అండర్–17 బాలికల విభాగంలో పోటీలు ఏర్పాటు చేశామన్నారు. వీరికి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, బ్యాట్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, యోగాలలో పోటీలు ఉంటాయన్నారు. ఎంఈవో–2 మద్దాలి వెంకటేశ్వరరావు, వ్యాయామోపాధ్యాయులు శుభాకర్, కృష్ణప్రసాద్, సురేష్, గెజిటెడ్ హెచ్‌ఎంలు సుజాత, కృష్ణ పాల్గొన్నారు.

పేకాడుతున్న ఇద్దరి అరెస్ట్

కాట్రేనికోన: మండలంలోని గాజుంగితిప్పలో పేకాట శిబిరంపై దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు కాట్రేనికోన ఎస్ఐ టి.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. గాజుంగితిప్పలో పేకాడుతున్నారంటూ తమకందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. శిబిరంలో పేకాడుతున్న దోమ మణికంఠ, బొమ్మిడి ప్రసాద్‌లను అరెస్టు చేయగా మరో నలుగురు పారిపోయారన్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.55,500 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

వైభవంగా మహా చండీ హోమం

కొత్తపేట: స్థానిక బోడిపాలెం విజయకనకదుర్గాదేవి ఆలయం వద్ద ఆదివారం మహా చండీ హోమం వైభవంగా నిర్వహించారు. దుర్గాదేవి విగ్రహ పునఃప్రతిష్ఠాపన, జీవ ధ్వజస్తంభం, లక్ష్మీదేవి విగ్రహం, బలిపీఠం, సింహవాహన సంపూర్ణ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా నాలుగో రోజు ఆలయ కమిటీ, ఆలయ పునర్నిర్మాణ, పునఃప్రతిష్ఠ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి పాండురంగాచార్యుల పర్యవేక్షణలో వేదపండితుల బృందం 150 మంది దంపతులతో మహా చండీహోమం జరిపించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపించారు. పునఃప్రతిష్ఠకు విరాళాలు ఇచ్చిన, వివిధ రూపాల్లో సహకరించిన భక్తులను, పండితులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించి, వేదపండితులతో వేదాశీస్సులు అందజేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



అప్పనపల్లిలో పేదలకు దుప్పట్లు అందజేస్తున్న నల్లా పవన్

మామిడికుదురు: కాపు నేత నల్లా పవన్ పుట్టిన రోజు వేడుకలను ఆదివారం అప్పనపల్లిలో స్థానికులు ఘనంగా నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను పవన్ కట్ చేసి అభిమానులకు పంచారు. ఈ సందర్భంగా తులా బ్రహ్మాజీ సమకూర్చిన దుప్పట్లు, చీరలను పవన్ చేతుల మీదుగా 50 మంది పేదలకు పంచారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అడబాల తాతకాపు, సుందరనీడి చిన్ని, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ, తులా గోపాలకృష్ణ, పోతు కాశీ, తులా నాగరాజు, బొలిశెట్టి శివ, ఉప సర్పంచ్ మేడేపల్లి చిన్ని, కంకిపాటి వెంకటేశ్వరరావు, తులా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ విప్పర్తి పరామర్శ



సూర్యకాంతం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

అమలాపురం రూరల్: మండలంలోని గున్నేపల్లి సాకుర్రుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గోసంగి అయ్యప్ప తల్లి సూర్యకాంతం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు అమలాపురం వైద్య కళాశాలకు అప్పగించారు. మాతృ వియోగంతో బాధపడుతున్న అయ్యప్పను జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆదివారం పరామర్శించారు. సూర్యకాంతం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సూర్యకాంతం భౌతిక కాయాన్ని వైద్య కళాశాలకు దానంగా ఇవ్వడం వివేకవంతమైన నిర్ణయమని జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు అన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ప్రమాదం



ప్లాస్టిక్‌ను నివారించాలంటూ ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు, చిత్రంలో ఆర్ఏవో మునిస్వామి

యానాం: ప్లాస్టిక్ సంచులు ఉపయోగించడం వల్ల భవిష్యత్‌లో పర్యావరణ సంబంధిత ప్రమాదం పొంచి ఉందని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక డ్రీమ్స్ ఫౌండేషన్ స్కూల్ విద్యార్థులు ప్లాస్టిక్ రహిత స్వచ్ఛ యానాం అనే నినాదంతో నిర్వహించిన భారీ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులను ఎక్కడపడితే అక్కడ పారేస్తే అవి డ్రెయినేజీల్లోకి వెళ్లి మురుగునీరు నిలిచిపోవడమే కాకుండా అపరిశుభ్రమైన వాతావరణాన్ని కలుగజేస్తున్నాయన్నారు. అనంతరం ప్లాస్టిక్ నిషేధించాలంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తూ పురవీధుల్లో విద్యార్థులు ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ శేరు వెంకటరమణ, మేనేజర్ గంగాధరవర్మ, హెచ్‌ఎం మాథ్యూస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ



విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ముమ్మిడివరం: పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయంతో ఓ పేద విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరించారు. 1970–75 సంవత్సరాల్లో ముమ్మిడివరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చప్పిడి లక్ష్మణరావు, జేవీఎల్ నరసింహారావు, మొవ్వలపల్లి సోంబాబు, కంచర్ల నారాయణరావు, సలమాటి కామరాజాచార్యులు కలిసి చదువుతున్నారు. గత జులైలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పేద విద్యార్థులకు సాయపడాలని నిర్ణయించుకున్న సదరు మిత్ర బృందం బీటెక్ చదువుతున్న కొనేల్లంకకు చెందిన హేమంత్‌కు రూ.30 వేల విలువ చేసే ల్యాప్‌టాప్ ఆదివారం అందజేశారు.

రేపు మెడికల్ కౌన్సెలింగ్ ప్రారంభం

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా నీట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్ కౌన్సెలింగ్ ప్రక్రియను ఈ నెల 5 నుంచి నిర్వహించనున్నట్లు సీఎం రంగసామి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఎంబీబీఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి నిర్ణయించామన్నారు. దానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి పంపిన ఫైలు ఆమోదానికి ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. ఎల్జీ తమిళిసై సౌందరాజన్ మాట్లాడుతూ కేంద్రం పది శాతం రిజర్వేషన్ పాలసీని ఆమోదిస్తుందనే నమ్మకంతో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు



దాతలకు స్వామి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రమేష్‌రాజు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి ఆత్రేయపురం మండలం నార్కెడమిల్లికి గ్రామానికి చెందిన చిన్న–సూర్యకళ దంపతులు రూ.30 వేలు, బిక్కవోలు మండలం కొంకుదురు గ్రామానికి చెందిన పి.సత్యస్వరూప్‌రెడ్డి–మమత సమత దంపతులు రూ.10,116, గుడివాడకు చెందిన జి.గోసాయి నాగ యోగేశ్వర్‌రెడ్డి రూ.10,116, రామచంద్రపురానికి చెందిన కె.శరత్‌కుమార్–అనూష సాయి దంపతులు రూ.10,001 విరాళం అందించినట్లు చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతలకు ఆలయ చైర్మన్ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.